క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



మంగొల్లు(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీఅభయ ఆంజనేయస్వామి వారి ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం స్వామివారికి అర్చకులు పవన్‌శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణాన్ని పఠించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి పూజలు చేశారు.

తిరుపతమ్మ సేవలో ఖమ్మం న్యాయమూర్తి

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్రం ఖమ్మంనకు చెందిన న్యాయమూర్తి దీప దంపతులు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి వారిప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజూ ఆందోళన



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): అనిగండ్లపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఆపరేటర్లు ఆళ్ల మహేష్, కోట సురేష్, జాలా కిరణ్, అమరబోయిన నరేష్‌లను విద్యుత్‌శాఖ అధికారులు విధుల నుంచి తొలగించిన నేపథ్యంలో బాధితులు రెండోరోజు బుధవారం కూడా ఆందోళన చేశారు. వీరి స్థానంలో నియమించిన కొత్త వారు విధులకు హాజరుకాగా, తమను విధుల నుంచి ఎలా తొలగిస్తారంటూ బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. సబ్‌స్టేషన్ వద్ద నుంచి ఆళ్ల మహేష్, సురేష్, కిరణ్, నరేష్ వెళ్లడం లేదంటూ ఆశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెనుగంచిప్రోలు హెడ్‌కానిస్టేబుల్ వహాబ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని బాధితులను విచారించారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ నాలుగేళ్లుగా పనిచేస్తున్న తమను ఉన్నపళంగా విధుల నుంచి తొలగించడం తగదన్నారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామని వారు తెలిపారు.

ఆలోచింపజేసిన 'మనస్సాక్షి' నాటిక

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా 'మనస్సాక్షి' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. మనిషికి కావల్సింది అవినీతితో సంపాదించే డబ్బు కాదని, గుప్పెడు మెతుకులు, ఆరు అడుగుల నేల, చారెడు గుడ్డ అన్న కథాంశంతో కళాకారులు రక్తి కట్టించారు. హర్ష క్రియేషన్స్ (విజయవాడ) పక్షాన నటుడు కత్తి శ్యాం ప్రసాద్ నిర్వహణలో దివంగత డాక్టర్ బ్రహ్మానందం రచించిన ఈ నాటికకు రంగస్థల సీనియర్ నటుడు పిళ్లా నటరాజ్ దర్శకత్వం వహించి నటించారు. వేంపాటి రమేష్, ఎస్.అమృత వర్షిణి, సాగర్, మల్లేశ్వర పట్నాయక్ పాత్రోచితంగా నటించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం చింతాడ ప్రసాద్ తన ధ్వన్యనుకరణ (మిమిక్రీ)తో అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీసాయిబాబా నాట్యమండలి (విజయవాడ) ఆధ్వర్యంలో కళాకారిణులు జీఎన్‌డీ కుసుమసాయి, బత్తిన రూపశ్రీ, చిందాన తేజశ్రీ ఆంధ్ర నాట్యం, కూచిపూడి, భరత నాట్యంతో పలు అంశాలకు చక్కని ఆంగికాభినయంతో నర్తించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

స్తబ్దుగా రియల్ వ్యాపారం

- రియల్ ఎస్టేట్ రంగం ఢమాల్
- హైప్ తప్ప..బేరసారాల్లేవ్
- అధిక ధరలకు అగ్రిమెంట్లు
- పత్తాలేని వ్యాపారులు



నందిగామ పట్టణంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్

నందిగామటౌన్: ప్రభుత్వం మారింది..రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుంది..కృష్ణానదికి ఆవైపు రాజధాని..ఈ వైపు నందిగామ నియోజకవర్గ భూములు..ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడుపువ్వులు..ఆరుకాయలు..భూముల ధరలకు రెక్కాలొస్తాయి..మంచి ధరకు మంచి ధరకు పొలాలు అమ్ముకుందామని రైతులు ఆశపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగితే నాలుగురాళ్లు వెనకేసుకుందామని వ్యాపారులు ఆకాంక్షించారు. కాని వీరి ఆశలన్నీ అడియాసలయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలైనా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడం అటుంచి పూర్తిగా ఢమాల్ అంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్నంత ధరలు కూడా ప్రస్తుతం లేకపోవడంతో భూముల యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీలాపడ్డారు.

ఆశలపై నీళ్లు..

కృష్ణానది పరివాహక ప్రాంతంగా ఉన్న నందిగామ నియోజకవర్గంలో వ్యవసాయ పొలాలకు నీటివసతి, రవాణా. తదితర వసతులుండటంతో ఈ ప్రాంతంలోని భూములకు మంచి డిమాండ్ ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు, వెంచర్లు, విల్లాల నిర్మాణానికి సైతం భూములు అనువుగా ఉండటంతోపాటు నియోజకవర్గంలోని సింహభాగం విస్తీర్ణం జాతీయ రహదారికి సమీపంలో ఉంటుంది. ప్రభుత్వం మారితే పరిశ్రమలు వస్తాయి..నిర్మాణ రంగం ఊపందుకుంటుంది..పెద్దపెద్ద కంపెనీలు వెంచర్లు వేస్తాయి. భూముల ధరలకు రెక్కలొస్తాయి అని ఆశించినవారు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలైనా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏమాత్రం పుంజుకోకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

గత ప్రభుత్వంలో కన్నా తక్కువ ధరలు..

కూటమి ప్రభుత్వం వచ్చినా రియల్ వ్యాపారం ఏమాత్రం ఊపందుకోలేదని పలువురు రియల్ వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వంలో కన్నా ప్రస్తుతం భూముల ధరలు ప్రాంతాన్ని బట్టి హెచ్చుతగ్గులున్నాయని చెబుతున్నారు. కానీ నందిగామ నియోజకవర్గంలో మాత్రం ధరలు పెరిగిన దాఖలాలు లేవు. ధరలు పెరగకపోయినా గత ప్రభుత్వంలో ఉన్నంతగా కూడా భూములు, స్థలాల కొనుగోళ్లు సాగడంలేదంటున్నారు.

అంతే కాకుండా గత ఆగస్టులో సంభవించిన వర్షాలు, భారీ వరదల కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం అట్టడుగు స్థాయికి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జమిలి ఎన్నికలు వస్తే ప్రభుత్వం మారుతుందనే అనుమానంతో ఇతర ప్రాంతాలకు చెందిన రియల్ వ్యాపారులు ఇక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ధైర్యం చేయలేకపోతున్నారనే వ్యాఖ్యలు రియల్ ఎస్టేట్‌వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

హైప్ తెచ్చేందుకు ధరల పెంపు..

కూటమి ప్రభుత్వంలో భూముల ధరలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో హైప్ తెచ్చేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు యత్నిస్తున్నారు. భూముల ధరలు పెరుగుతున్నాయంటూ సరికొత్త నాటకానికి తెర తీశారు. నందిగామ పట్టణంలో ఎకరం రూ.10 కోట్లు ధర వస్తుంది పొలాలు ఎవరూ అమ్ముకోవద్దు, వేచి ఉండాలంటూ ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతోంది. అంతేకాకుండా చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు పలుకుతున్న ఎకరం భూమిని అమాంతం రూ.45లక్షల నుంచి 60 లక్షలకు కొనుగోలు చేసి రైతుల నుంచి అగ్రిమెంట్లు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయానికి పత్తా లేకుండాపోయారు. దీంతో ఆయాభూములను అటు అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సదరు రియల్ వ్యాపారులు ముందుకు రాక రైతులు అవస్థలుపడుతున్నారు.

ఇక రాజధాని అమరావతికి దగ్గరగా ఉండే కంచికచర్ల మండలంలో సైతం ఎకరా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలకు మించి కొనుగోలు చేసేందుకు ముందుకురాని పరిస్థితి నెలకొంది. ధరలు పెరిగాయంటూ ప్రభుత్వ ప్రతిష్ట పెంచుకునేందుకు ధరలు అమాంతం పెంచి ఆశచూపుతుండటమే తప్ప ఆ మేరకు క్రయవిక్రయాలు సాగడం లేదంటూ భూముల యజమానులు, రియల్ వ్యాపారులు చెబుతుండటం గమనార్హం.

దివ్యాంగునికి బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: మంగొల్లు గ్రామానికి చెందిన దివ్యాంగుడు గజ్జెల లక్ష్మీనారాయణకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం తన నివాసంలో బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అలింకో ఫౌండేషన్ వారి సహకారంతో అందజేసిన ఈ బ్యాటరీ ట్రై సైకిల్‌ను దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు స్వయంగా నెల్లూరు వెళ్లి తీసుకురావడం అభినందనీయమన్నారు. నడవలేని వారిని గుర్తించి వారందరికీ కూడా ఇలాంటి ట్రై సైకిళ్లను అందజేస్తామని వివరించారు. అటువంటి వారిని గుర్తించాలని దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావుకు సూచించారు. వీలైతే ప్రభుత్వం ద్వారా కూడా ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘ కార్యదర్శి గోనెల విజయలక్ష్మి, సంఘ సభ్యులు అలోషియస్, సింగం వీర్రాజు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ పద్మావతి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ రాజ్ సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా సర్పంచ్‌లు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఐక్యంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ట్రైనర్‌లు లింగయ్య, శ్రీనివాసరావులు మాట్లాడుతూ పంచాయతీ సుపరిపాలన, నీటి సమృద్ధి గ్రామాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత అంశాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామినాయక్, మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రెండోరోజు శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు.

నందిగామలో..

నందిగామటౌన్: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలని ఎంపీపీ ఆకుల హనుమంతరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులపై కూడా ఉందన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలోనే ప్రజలకు సుపరిపాలన అందించడంతోపాటు సామాజిక న్యాయం, సామాజిక భద్రతను అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం : ఆర్డీఓ



నందిగామ రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలు వింటున్న ఆర్డీఓ బాలకృష్ణ



కునికెనపాడులో డీటీ మానసకు తమ సమస్యలు వివరిస్తున్న రైతులు

నందిగామటౌన్: భూసంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందించే ఆయా అర్జీలను 45రోజుల్లోగా పరిష్కరిస్తామని నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ తెలిపారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ అధికారులే మీ గ్రామాలకు వచ్చిన సమస్యలపై అర్జీలు తీసుకుంటున్నందున, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పట్టాదార్ పాస్ పుస్తకాల మంజూరు, భూసర్వే, ఈనాం భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మొత్తం 114అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

పొన్నవరం(వీరులపాడు): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. భూసంబంధిత సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల నిర్వహణ లక్ష్యమని పేర్కొన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతుల నుంచి 10 అర్జీలు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీదేవి, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భూవివాదాలకు పరిష్కారం : డీటీ

కునికెనపాడు(కంచికచర్ల): భూవివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కంచికచర్ల డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. మండలంలోని కునికెనపాడు గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూసదస్సు నిర్వహించారు ఈసందర్భంగా మానస మాట్లాడుతూ భూముల సర్వే నెంబర్లలో కొలతలు, హద్దులు తేడాలున్నట్లయితే అర్జీలు అందజేయాలని రైతులను కోరారు. పట్టాదార్ పాసు పుస్తకం మంజూరు, భూమికొలతలు, హద్దుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముగ్గురు రైతులు అర్జీలు అందజేయగా, ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని డీటీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, ఆర్ఐ వెంకట్, వీఆర్వో ప్రదక్షిణరావు, రైతులు పాల్గొన్నారు.

కంచికచర్ల పోలీసుస్టేషన్ తనిఖీ



కంచికచర్లలో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ తిలక్, పక్కన సీఐ చవాన్, ఎస్ఐ రాజు

కంచికచర్ల: శాంతిభద్రతలకు పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ తిలక్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్రిపుల్‌రైడ్ చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నట్లయితే గ్రామపెద్దల ద్వారా పరిష్కారం చేసుకోవాలని, అక్కడ పరిష్కారం కాకపోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తమ సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉండాలన్నారు ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందితే ఆటోడ్రైవర్లపై కేసు నమోదు చేస్తామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్, ఎస్ఐ బోనగిరి రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు దూరంగా హాస్టల్

చేరేందుకు ఆసక్తిచూపని విద్యార్థులు



కొణకంచి బాలికల వసతి గృహం

కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి ఎస్సీ బాలికల వసతి గృహంలో అన్ని రకాల వసతులు ఉన్నా విద్యార్థినులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. గ్రామ శివారులో వసతి గృహం ఉండగా, అక్కడి నుంచి రోజు రెండు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఈ హాస్టల్‌లో విద్యార్థినులను చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు ఆసక్తిచూపకపోవడంతో హాస్టల్‌లో విద్యార్థినుల సంఖ్య 15కు పడిపోయింది. ఆడపిల్లలు రోజూ అంతదూరం నడిచివెళ్లాలంటే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో తమ చిన్నారులను ఈ హాస్టల్‌లో చేర్పించడంలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు.

విశాల భవనాలు...

హాస్టల్‌కు విశాలమైన తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్లు, రన్నింగ్‌వాటర్, వంట గది తదితర అన్ని వసతులు ఉన్నాయి. కానీ విద్యార్థులు మాత్రం చేరడం లేదు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు కూడా స్థానికులు కావడంతో కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే వచ్చిపోతున్నట్లు సమాచారం. ఈ హాస్టల్‌ను పాఠశాలకు అందుబాటులో ఉండేలా మార్చితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంపై ఏఎస్‌డబ్ల్యూ గణేష్‌బాబును వివరణ కోరగా కొణకంచి వసతి గృహం వద్ద నుంచి పాఠశాలకు వెళ్లే సమయానికి ఆర్టీసీ బస్సు ఉండేలా చూడాలని అధికారులను కోరినట్లు తెలిపారు. బస్సు సదుపాయం ఉన్న విద్యార్థులు వచ్చేందుకు సుముఖంగా లేరన్నారు. హాస్టల్‌ను గ్రామంలో ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలోని 5వ వార్డు వైవై కాలనీలోని దైవస్వరూపి మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ జోసఫ్ మోహన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని పాస్టర్ జోసఫ్ మోహన్ తదితర పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చే శారు. పాస్టర్ జోసఫ్ మోహన్ ప్రసంగిస్తూ ఏసుక్రీస్తు మాదిరి జీవితాన్ని ప్రతిఒక్కరు ఆచరించాలని సూచించారు. అనంతరం చిన్నారులచే ప్రదర్శించిన క్రీస్తుపుట్టుకను వివరించే నృత్యగేయాలు, చిరు నాటికలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వర్తమానికులు రాజమండ్రికి చెందిన శామ్యూల్‌రాజ్, ఎం.యోహాను, సంఘస్తులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో బుధవారం విజయవాడకు చెందిన శ్రీదమని ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు అందరినీ అలరించాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై దమని ఆర్ట్స్ వ్యవస్థాపకులు మాడుగుల లక్ష్మణరావు బృందం పలు భక్తి గీతాలను ఆలపించింది. దండు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, రజని, రూపశ్రీ, కుసుమ పాటలను పాడగా, వారికి కీబోర్డుపై రవి, పాడ్స్‌పై లక్ష్మణ్, తబలాపై వై.రాజు, కాంగో డ్రమ్స్‌పై వెంకటరమణ చక్కటి సహకారం అందించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరప్పాడుతండ, పట్టణంలోని శాంతినగర్ ప్రాంతాలలో బుధవారం విజయవాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 69 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బాణావత్ సావిత్రి, పగిడిపర్తి వెంకన్నలను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రామశేషయ్య, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

250 మందికి వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని స్మైలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల సహాయార్థం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎంతో నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్న స్మైలీ హాస్పిటల్ వైద్యబృందాన్ని అభినందించారు.వైద్యశిబిరానికి పరిసర గ్రామాల నుంచి సుమారు 250 మంది హాజరుకాగా, వైద్యనిపుణులు వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహక ప్రతినిధి దాచేపల్లి శ్రీనివాస్ తెలిపారు.